# పెళ్ళికొడుకు ఊరేగింపు

వడ్లపట్ల దయానందం

నల్లద్దాల కళ్ళజోడెట్టుకున్నాడు పెళ్ళికొడుకు, రేతిరి ఎనిమిది గంటలకాడ ఊరేగింపులో. ముద్దబంతిపువ్వలా బొద్దుగున్న పెళ్ళికూతురు తలొంచుకునే వారగచూసి కులికిపోతున్నది. పారాణెట్టుకున్న కాళ్ళమీద ఎవరికంటడకుండ, సాటుగ గిరతన్నాడా కొంటె బుల్లోడు. తనూ ఓ మాటు కసుక్కున గిల్లింది. ఆ దెబ్బతో యికూరుకున్నాడు నవ్వకోని.

"ఏరా ... గవిరిగా ... సోడాకొట్టుకాడ లైమ్‌జూస్ కొట్టిచ్చేవిర" నడిగాడు పెళ్ళికుని స్నేహితుడు 'సింవాశలం.'

"అక్కర్లేదనక, ఇపుడేగ ఒకటుచ్చుకుంది... అవునుకని ఒరేయ్ సింవాశలమా..ఆ సెంటరికాడాగినప్పుడు "కిలారి సెట్టోణ్ణి" మేగమాల ఓయించ మన్రా" అన్నాడు పెళ్ళికొడుకు.



పెళ్ళికూతురు 'నేస్తాలు' కసుక్కున నవ్వేసింది. అవునవును..పెళ్ళికి ముందప్పుడూ తనింటి పక్కింటికి స్నేయితు డొంకమీదొచ్చి ఈ పాటేగా ఈలమీదోయించేవోడు, తనకినిపిచ్చేలా.

"ఏటే ఓలమ్మి నీ కులుకు"—పూలఓడకి ఆపెడ నున్న నూకాలమ్మ పెళ్ళికూతురు బుగ్గలు సిదిమేసి యకశక్కాలాడింది.

అసలూరేగింపుకి పూలోడుండాలన్నది పెళ్ళికొడుకు పిన్ని నూకాలమ్మ పంతమే!... పెళ్ళికొడుకు తల్లి సీతమ్మ సిన్నకారన్నది.

"ఊహు సిన్నకారొద్దు..పూలోడని స్నేయితులందరికి సెప్పేశా"నన్న పెళ్ళికొడుకు సపోటా మీద నూకాలమ్మ పంతమే నెగ్గింది.

ఆ నల్లద్దాల జోడెట్టుకోమన్నదికూడ నూకాలమ్మే. నూకాలమ్మమద్ది బస్తీలో ఉంటన్నదిలే. అందుకే పెళ్ళికొడుకు ముస్తాబీకి నూకాలమ్మే బోలెడు సలహాలిచ్చింది. రంగురంగుల చేరుమాలకి అత్తరు పూసుకోమన్నది. ఐరోడ్డు కరాఫు దువ్వుకోమన్నతి. చేతి గడారంకూడ బస్తీ కుర్రోడిదగ్గెరెతువుచ్చుకొచ్చింది. ఈ మజ్జ ఎండలకి దెబ్బతిని ఆదాడతం లేదంట. ఆయినా అది సేతినుంటెసాలు, కరకట్టు టైం సెప్పెయ్యగల్ననాడా గడారం ఎట్టుకొచ్చిన బస్తీ బుల్లోడు.

"మాబాగె ... దానాటతో పనేటి ... సేతికి నిండుగుంటద"ని బలవంతాన పుచ్చుకోని ఇచ్చింది పెళ్ళికొడుక్కి నూకాలమ్మ.

ఆ గడారం తొలుకు బస్తీబుల్లోడి మనసు గతుక్కుమంది. తంది బోడి సెయ్యాయి-పోతన్నందుకు అసలాగడారం తందిగూడ గాదు...ఒక స్నేయితుణ్ణి బతిమిలాడి, ఆడి దోరా, మరొవాడి దగ్గరుచ్చుకొచ్చాడా ఆడరి గడారాన్ని. దానికైన అంత బాధపడతమెందుకంటే...తన నిండుసోకు ఇక్కడొకళకి సూటెట్టాలొచ్చింది మరి. అదే తన మేనమామ కూతురు 'నాంచారి'కి. దాన్నిమజ్జ తన కడుగుతున్నారులే. పచ్చగ నున్నగ-నిగనిగలాడుతూ బొమ్మిడాయిలా గుంటది. ఊళ్ళో పెళ్ళి కనక, అదీ పెళ్ళికి వస్తదనే తను పనికట్టుకు బస్తీనించొస్త లేపోతే బద్దకించేసే వోడేనేమో?

ఇంకాక సూసేడు...అది కూడుంది ఊరేగింపులో. గడారం దానికి అపడాలని పొడుగు సేతుల చొక్కా..ఎనక్కి కూడ మడిసేడు. దానికి యూక కనబడాలని పెళ్ళి పందిట్లో పెత్తనమంత తనే సేసినాడు.

దొంగసాయాల ... ఆదెక్కడున్నా తనెంకే వాలు సూపులు సూసి ముసిముసిగ నవ్వేసేది.

ఊరేగింపుకి బయల్దేరేముంగల సిన్నకుర్రాడితో తాంబూళ మంపింది. పెళ్ళయినాక ఆ మర్నాడొక పూటుంటాని కాళ్ళింటికి రమ్మని కబురు కూడాపంపింది తాంబూళంతోపాటు.

దానికేటా బెట్టుసరి...కాబోయే మొగుడితో ముందుగా మాట్టాడితే నోటి ముత్తాలుగన రాలిపోతయ్యా...అందులోని బయటిది కాదయ్యో. సయానా మేనమామ కూతురయ్యో.

"ఓ యబ్బో...దీనికింత టెక్కుయితే మనకెంతుండాలనుకోని మణసులో ఎల్లాలనిపించినా... "ఊహూ...ఉండేది లేదని, కబురెట్టేసినాడు... అందుకే కామోసు దానికో్కపం. పెళ్ళిలోలాగ ఊరేగింపులో తనెంక తిన్నగా సూడ్డం లా.

ఇందాక అందరికంటా ఎనకపడ్డప్పుడు, తన కోసమేం..టక్కుతుందేమో అనుకోని తనూ ఎనక్కి దిగబడ్డాడు, పలకరించాకమాటడుగుదామనుకోని. నూకాలమ్మత్త అక్కడికి సిద్ధమైంది. తనకిగుండె లదిరి కాళ్ళొణికినాయ్. వచ్చి నెడగొట్టేసింది కాని లేకపోతే నాంచారిని పలకరించేసేవోడే తను.

"ఏంరా అప్పల్రాజూ. ఎనకెనకిట్టా తచ్చాడతన్నా వేంవిరా. బస్తీవోడివి నువ్వు గూడిట్టైతే ఎట్టా. ఈ కిళ్ళీల బుట్టుచ్చుకోని పంచిపెట్టు"మంది బుట్ట తన సేతుల్లో బలవంతాన ఎట్టేస్తూ. మరి మాట్లాడలేక పొయ్యాడు తను.

ఊరేగింపు కిళ్ళీకొటు సెంటరుకాడికొచ్చేసింది. ఆ సెంటరుకాడే అగి 'బాండోళ్ళు' రమణయింన పాటలోయించాలి.

తన మాటమీద బాండోళ్ళు 'మేగమాల' ఎత్తుకున్నందుకు, వూలోడలోని పెళ్ళికొడుకబ్బి పోనాడు.

మొగోళ్ళంతా మేళగాళ్ళ సుట్టు మూగారు పాటినటానికి.

ఆడోళ్ళంతా వూలోడ సుట్టుముట్టారు...ఎక సెక్కాలాడ్డానికి...బస్తీ బుల్లోడప్పల్రాజుకూడ ఆడోళ్ళ నిడిసిపెడతంలా. మెడలో వేరుమాలిగ మత్తుగ సుట్టుకున్నాడు. కాలరు పైకిలేపాడు... ఎంతసేపినా పాపం, గడారం లేకపొయ్యిందే అన్న బాధ తన్ని ఇడిసిపెడతంలా.

పెళ్ళికొడుకెట్టుకున్న నల్లద్దాల కళ్ళజోడద్దాలు మొగం రంగులా సక్కగా కలిసిపోయినై.. తెల్లటి దంతం "పెరేము" కొట్టొచ్చినట్లా పడతంది. జోడు మొగానికి బలే సక్కగమిరిందని మెచ్చుకున్నారాడోళ్ళంత.

దానిమీద నూకాలమ్మ ఉబ్బిపోయి..ఆ జోడెవరిదైంది...ఎలగొచ్చింది., మొదలైనదాని "కథాటోరి" చెప్పుకొస్తం దాళ్ళతోటి.

ఎత్తైదు బరువున్న ముంజేతి ఎండికడాలని ఎనక్కి లాక్కుని చేతులూపుతూ కీచిగ సెప్పుకు పోతన్నది.

"అది వోరిదనుకున్నారు?...మా తోటికోడలు మర్దిదేగా...ఓయబ్బో అదు బస్తీలో గవరమెంటుద్దోగి...అదేటిదమ్మా. దానిపేరు...ఆ...కలకటేరాఫీసు ప్యూను" ఈమాటన్న నూకాలమ్మ కనుబొమ్మలు పైకెత్తుకుని ఇంకా యిలగన్నది:

"కలకటేరంటే తెల్సుగా...ఎంత పెద్దో...ఓలమ్మి మనలాటోళ్ళ మసలు సూడగల్దుంవిటి... మరీడెప్పుడు ఆయనగ్గిరుండాల్సిందె ... ఆఫీసులోడికి మంచి యూలిం ఉందంటే...ఈమద్దెప్పుడో ఆఫీసు ఆడ కలారుకులు ... ఈడిని కాఫీ తెచ్చి పెట్టమన్రంట...యూంవిగాచారం, ఇంత బతుకు బతికి ఈ ఆడోళ్ళకీ కాపీలందిచ్చుట మావల్లాని తేనుపొమ్మని తెగేసి సెప్పినాడంట ... మీకు కాదు ప్యూనుని, కలకటేరుగారికని తెగేసి సెప్పి పారేసినాడంట.

అమట్నా ఆడోళ్ళుకూడ సామానులుగారంట. కలకటేరు కిందాయిలికి ఫిరాదు చేసినారంట... పూను మా మాటింటంలేదని. దానిమీదాయన మంచిగ పిల్చి తెచ్చిపెట్టమంటే—

పోనీ ఆడకూతుర్లు లెమ్మని దయదల్చి తెచ్చి పెడుతున్నాడంటప్పట్నుంచి. అసలాడి రూపే కలకటేరురూపు ... మన పెద్దకోడలు తమ్ముడి కూతుర్నేగా ఆడికిచ్చింది. నామాటంటే సెడ్డగురిలే ఆడికి."

ఇక్కడ నూకాలమ్మ 'లెకిచరు' పూర్తయ్యేతలికి, అక్కడ బాండోళ్ళ 'మేగమాల పూర్తయి ముందుకి కదిలి పోనారు.

వూలోడా కదిలింది. నూకాలమ్మ నాయకత్వాన ఆడపేరంటాళ్ళూ కదిలినారు.

పెళ్ళికొడుకు గవరయ్య ... తనెక్కడుందీ మరిసిపోయి ... బాండోళ్ళ పాటవ్వంగానే ఈల మీద మేగమాల అందుకోబోనాడు.

పెళ్ళికూతురు నేస్తాలు పగలబడి నవ్విపారేసింది. కిలకిలమన్నారాడోళ్ళంతా.

ముందుకి సాగిపోనాది ఊరేగింపు.

అప్పల్రాజు మట్టుకు నాంచారకోసం మాటు మీదే ఉన్నాడు.

★